క్లుప్తంగా

యూటర్న్ ఏర్పాటు చేయాలని పనుల అడ్డగింత



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి నుంచి గద్దెరాగిడి వరకు నూతనంగా నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్ డివైడర్‌కు యూటర్న్ ఏర్పాటు చేయాలని తిమ్మాపూర్ గ్రామస్తులు, పద్మావతి కాలనీవాసులు శనివారం డివైడర్ పనులు అడ్డుకుని నిరసన తెలిపారు. తమ వినతిని పట్టించుకోకుండా నేషనల్ హైవే అథారిటీ వారు యూటర్న్ దారి వదలకుండా, డివైడర్‌ను నిర్మించటం సరికాదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ గ్రామాన్ని దృష్టిలో ఉంచుకొని యూటర్న్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

జైపూర్: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన భోజనపు రమేశ్ గడ్డివాము ప్రమాదవశాత్తు శనివారం దగ్ధం అయింది. స్థానికుల వివరాల ప్రకారం..సుమారు రూ.40వేల విలువగల వరి గడ్డిని పశువుల మేత కోసం రమేశ్ తన ఇంటికి సమీపంలో నిల్వ చేశారు. ఒక్కసారిగా వరిగడ్డికి నిప్పు అంటుకుంది. పెద్ద మొత్తంగా మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే పూర్తిగా కాలిపోయింది. వేసవి కాలంలో పశువులకు మేత లేకుండా అయిందని రైతు రమేశ్ వాపోయాడు.

నగరపాలక సేవలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నఅధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థలో ప్రజలకందిస్తున్న వివిధ సేవల గురించి శనివారం జిల్లా కేంద్రంలోని మిమ్స్ ప్లే స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజలకు తాగునీటితో పాటు, ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి చె త్తను సేకరించడం, డ్రెయినేజీలను శుభ్రపరిచి, దో మల నివారణ మందు స్ప్రే చేయడం వంటి పనులను ఏ విధంగా చేపడుతున్నారని విద్యార్థులకు వివరించారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఇంటి అనుమతులు, ఇంటి పన్ను వసూళ్లు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, రోడ్లు వేసి, డ్రెయినేజీలను నిర్మించడం వంటి పనులను ఏ విధంగా చేపడతారో మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ క్లర్క్ శంకరయ్య వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యాలయం అధికా రులు, సిబ్బంది, మిమ్స్ స్కూల్ టీచర్లు మనీష, లలిత, సృజన, రూపారాణి, స్వప్న, సంతోషి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అన్ని వర్గాలను మోసం చేసింది కాంగ్రెస్సే'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రఘునాథ్

చెన్నూర్: కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలు ఇచ్చి అన్ని వర్గాలను మోసం చేసిందని పార్లమెంట్ పరిధి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రఘునాథ్ వెర్రబెల్లి అన్నారు. స్థానిక మర్వాడీ ధర్మశాలలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలపర్చిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, ముల్క కొమురయ్యలను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోమాస శ్రీనివాస్, దుర్గం అశోక్, జాడి తిరుపతి, బత్తుల సమ్మయ్య, అనితరెడ్డి, వెంకటనర్సయ్య, రాపర్తి వెంకటేశ్వర్, తుమ్మ శ్రీపాల్, శివకృష్ణ, మంత్రి రామయ్య పాల్గొన్నారు.

'ఇస్కాన్' మోసంపై ఈడీకి ఫిర్యాదు

భీమారం/పాతమంచిర్యాల: భీమారం మండల కేంద్రంలో ఇస్కాన్ పేరిట రియల్ వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసాలకు గురి చేస్తున్నారని శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ నయీంపాషా, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొంటు రాజు ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. డీటీసీపీ, రెరా అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్ముతున్నట్లు రెరా కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు.

స్పందించారు.. పరిష్కరించారు



మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట్ నుంచి పొన్నారం వెళ్లే దారి పక్కన వాటర్ ట్యాంక్ వద్ద పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతుండడంతో ఈనెల 17న 'సాక్షి' దినపత్రికలో 'తాగునీరు వృథా' అనే కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. అధికారులు శనివారం లీకేజీని గుర్తించి సరి చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు



భీమారంలో ప్రమాదానికి గురైనకారు (ఫైల్)

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం కస్తూర్బా బాలికల పాఠశాల వద్ద తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రెండు వరసల రహదారి నుంచి నాలుగు వరసల రహదారి ప్రారంభమయ్యే దగ్గర తగు సూచనల బోర్డులు లేకపోవడంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణపై సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ ప్రారంభమెప్పుడో?

వేమనపల్లి: మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తైనా, ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. నవంబర్ నెలలో ట్రాన్స్‌కో శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి డిసెంబర్‌లో పనులు పూర్తి చేసి ప్రారంభించాలని సూచించారు. సిబ్బంది కొరత, నిర్మాణ పనుల్లో కొన్ని లోపాల వల్ల ప్రారంభానికి ఆలస్యమవుతోంది. ఇటీవల క్వాలిటీ కంట్రోల్ అధికారులు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. కొన్నిచోట్ల లోపాలు ఉన్నట్లు గుర్తించారు. లైన్ క్రాసింగ్‌ల వద్ద, కొన్ని స్తంభాల ఏర్పాట్లు, స్తంభాల మధ్య దూరం ఉన్నట్లు సూచించారు. దీంతో ప్రారంభానికి నోచుకోకుండా ఆటంకంగా మారుతోంది. ప్రస్తుతం మండలంలోని నీల్వాయి 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆధారంగా విద్యుత్ సరఫరా కొనసాగుతుండగా, వేమనపల్లి, నీల్వాయి, ముల్కలపేట, దస్నాపూర్ ఫీడర్లు ఉన్నాయి. 1200వ్యవసాయ కనెక్షన్‌లు, 2800గృహ అవసర, కమర్షియల్ విద్యుత్ మీటర్లు ఉన్నాయి. దీంతో ఓవర్‌లోడ్ కారణంగా తరచూ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. పంటలకు, గృహ అవసరాలకు విద్యుత్ అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో సబ్‌స్టేషన్ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



కదిలిన అధికార యంత్రాంగం



చెన్నూర్ గోదావరి తీరంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

చెన్నూర్: గోదావరి తీరంలో పారిశుధ్యం లోపించింది.. పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'సాక్షి' ఈ నెల 20న 'తీరం..చెత్తమయం' అనే శీర్షికన కథనం ప్రచురించగా అధికార యంత్రాంగం స్పందించింది. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ శనివారం గోదావరి తీరాన్ని సందర్శించారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా గోదావరి నది తీర ప్రాంతంలో శుభ్రం చేయించారు. గుంతలమయంగా మారిన రోడ్డుకు సింగరేణి అధికారులు మరమత్తు చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలిగిస్తున్న సిబ్బంది

నస్పూర్‌లో నిర్మాణాల జోరు!

- వేగంగా విస్తరిస్తున్న పట్టణం
- జిల్లా కేంద్రానికి మించి నిర్మాణాలకు అనుమతులు
- అక్రమ అనుమతులకు తెరలేపినట్లు అనుమానాలు
- ఉన్నతాధికారులు దృష్టిసారించాలని డిమాండ్

డిసెంబర్ 2020 నుంచి 2025 జనవరి 26వరకు టీఎస్‌బీపాస్ దరఖాస్తులు	
మంచిర్యాల మున్సిపాలిటీలో	2,891
నస్పూర్ మున్సిపాలిటీలో	1,044

2025 జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 20వరకు టీఎస్‌బీపాస్ దరఖాస్తులు	
మంచిర్యాలలో	23
నస్పూర్‌లో	49



మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఇళ్లు

మంచిర్యాలటౌన్: మున్సిపల్ పాలన సంస్కరణలో భాగంగా ప్రభుత్వం 2020డిసెంబర్ నెలలో ఇంటి అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానం టీఎస్ బీ–పాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) విధానాన్ని తీసుకొచ్చింది. అప్పటి నుంచి అన్ని మున్సిపాలిటీల్లో వివిధ రకాల అనుమతులు టీఎస్ బీ–పాస్ ద్వారానే మంజూరవుతున్నాయి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేందుకు టీఎస్ బీ–పాస్ విధానాన్ని తీసుకురాగా, ఇందులోనూ కొన్ని అక్రమ భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకొని నిర్మాణాలను చేపట్టినట్లుగా ఆరోపణలున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పడక ముందు మంచిర్యాలలో నస్పూర్ కంటే రెట్టింపు ఇళ్లకు దరఖాస్తులు రాగా, కార్పొరేషన్‌గా మారిన తర్వాత మంచిర్యాల కంటే నస్పూర్‌లో రెట్టింపు ఇళ్లకు దరఖాస్తులు రావడం గమనార్హం.

ఎక్కువ ఎందుకో..?

మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలతో పాటు హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను కలిపి గత నెల 26న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 డిసెంబర్ నుంచి, గత నెల 26వ తేదీ వరకు మంచిర్యాలలో 2,891 ఇళ్లకు, నస్పూర్‌లో 1,044ఇళ్లకు అనుమతుల కోసం టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయా రెండు మున్సిపాలిటీలు కలిపి మంచిర్యాల కార్పొరేషన్‌గా మారాయి. గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 20వ తేదీ వరకు మంచిర్యాలలో 23ఇళ్లకు, నస్పూర్‌లో 49ఇళ్లకు టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కార్పొరేషన్‌గా మంచిర్యాల మారక ముందు నస్పూర్‌లో తక్కువ ఇళ్లకు దరఖాస్తులు రాగా, కార్పొరేషన్‌గా ఏర్పడిన తరువాత నస్పూర్‌లో మంచిర్యాలలో కంటే రెట్టింపు దరఖాస్తులు రావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పడినా టెక్నికల్‌గా ఇప్పటికీ టీఎస్‌బీపాస్‌లో నస్పూర్, మంచిర్యాల మున్సిపాలిటీలుగానే ఉన్నాయి. మంచిర్యాల కార్పొరేషన్‌గా పూర్తిస్థాయిలో మారేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. కమిషనర్లతో పాటు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది మంచిర్యాల కార్పొరేషన్ కేంద్రంగా పనిచేయాల్సి వస్తే, తమ ఇళ్లకు అనుమతులు కష్టమనే భావనతోనే అత్యధికంగా టీఎస్‌బీపాస్ దరఖాస్తులు నస్పూర్‌లో పెరుగుతున్నట్లు తెలుస్తోంది. నస్పూర్‌లో అక్రమ నిర్మాణాలతో పాటు, ప్రభుత్వ స్థలా లు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై ఎన్నో ఆరోపణల నేపథ్యంలో ఇళ్ల అనుమతుల కోసం పెరిగిన దరఖాస్తులపై ఉన్నతాధికారులు దృష్టి పెడితే, ఎన్ని అక్రమమైనవో తెలిసే అవకాశం ఉంది. ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీలకు కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రత్యేక అధికారిగా ఉండగా, టీఎస్ బీపాస్ అనుమతులపై పూర్తి స్థాయి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని పరిశీలించాకే అనుమతులు

టీఎస్ బీపాస్‌లో ఇళ్లకు అనుమతులు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతీ దరఖాస్తును ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలిస్తాం. రెవెన్యూ, ఇరిగేషన్‌కు సంబంధించిన ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వెంటనే ఆయా శాఖలకు వాటిని పంపిస్తాం. ఏ అభ్యంతరం ఉన్నా అనుమతులను ఇవ్వడం జరగదు. ప్రస్తుతం నస్పూర్, మంచిర్యాల మున్సిపాలిటీల పేరిటనే ఉన్న టీఎస్ బీపాస్ వెబ్‌సైట్ రెండు మూడు రోజుల్లో మంచిర్యాల కార్పొరేషన్ పేరిట వచ్చే అవకాశం ఉంది.

– సంపత్, టౌన్‌ప్లానింగ్ అధికారి, మంచిర్యాల నగరపాలక సంస్థ

విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలో శనివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా స్థానిక మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాల, ఉన్నత పాఠశాల మైదానాలను సందర్శించారు. సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో శానిటేషన్ సక్రమంగా లేదని, ఫ్యాన్లు పనిచేయడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే శానిటేషన్ పనులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు చుట్టూ డ్రెయినేజీల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు

చెన్నూర్: చెన్నూర్ శివారులో గల 863సర్వే నంబర్‌లోని స్థలాన్ని ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు గుర్తించి ఈ నెల 20న ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని తహసీల్దార్ మల్లికార్జున్ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి రెండు రోజులు గడవకముందే మాయం అయ్యింది. బోర్డు విషయమై తహసీల్దార్ మల్లికార్జున్‌ను వివరణ కోరగా.. రెండు రోజులుగా బోర్డుకు కాపాలాగా ఇద్దరు వీఆర్వోలను నియమించాం. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తొలగించినట్లు మా దృష్టికి వచ్చింది. బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని శాంతిఖని భూగర్భగని ప్రాజెక్ట్ పునఃర్ వ్యవస్థీకరణకు సంబంధించి మార్చి 6న ఉదయం 11గంటలకు పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో శనివారం కాన్ఫరెన్స్ హాల్లో ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు సూచనలు చేసి బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో ఏరియా ఎస్వోటు జీఎం విజయప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఇంజనీర్ వెంకటరమణ, ఐఈడీ రాజన్న, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, ఎస్టేట్ అధికారిణి స్వప్న, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్య, ఏరియా అధికారులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. | శిథిలమైన లైనింగ్..!



దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలోని 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ లైనింగ్ శిథిలమైంది. ఏళ్ల క్రితం కాలువకు సిమెంట్ లైనింగ్ వేయగా, ఇప్పటికీ ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో లైనింగ్ శిథిలమవుతోంది. అధికారులు స్పందించి శిథిలమైన కాలువ లైనింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సంజీవ, ఇరిగేషన్ ఏఈఈ | ఫోన్ నంబర్ : 91549 51581

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సాధన కోసం టీఎన్జీవోస్ ముందు ఉంటుందని, సీపీఎస్ వ్యవస్థను రద్దు చేసి పాత పెన్షన్ వ్యవస్థను ఓపీఎస్ అమలు చేయాలని, 317జీవో వంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు టీఎన్జీవోస్ ముందుంటుందని టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో శనివారం నిర్వహించిన టీఎన్జీవోస్ జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి ఏ.సతీశ్ కుమార్, ఉపాధ్యక్షులు కేజియా రాణి, శ్రీనివాస్, రామ్‌కుమార్, అంజయ్య, నరేందర్, సంయుక్త కార్యదర్శులు సునిత, పద్మలత, ప్రభు, వెంకటకృష్ణ, పబ్లిసిటి సెక్రటరీ యూసఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన



కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో శనివారం క్షయవ్యాధి(టీబీ) నివారణ, నిర్మూలన వంద రోజుల ప్రచార కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన కల్పించారు. గనిలో పనిచేసే కార్మికులకు చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాగం నవీన్ అవగాహన కల్పించి కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు.

సంక్షిప్త వార్తలు

వెల్డింగ్ చేస్తుండగా స్కూటీలో చెలరేగిన మంటలు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద గల ఓ గ్యాస్ వెల్డింగ్ షాపు వద్ద శనివారం స్కూటీకి వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు స్కూటీలో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన షాపు నిర్వాహకుడు, స్కూటీ యజమాని నీటిని, ఇసుకను మంటలపై చల్లడంతో మంటలు ఆరిపోయాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

క్రికెట్ టోర్నీ విజేత నెన్నెల జట్టు

నెన్నెల: మండల కేంద్రంలో పూదరి సత్యనారాయణగౌడ్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నెన్నెల జట్టు నిలిచింది. 10రోజుల పాటు కొనసాగిన టోర్నమెంట్‌లో 45జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నెన్నెల జట్టు భీమారం జట్టును ఓడించి చాంపియన్‌షిప్ దక్కించుకుంది.

ప్రసన్న హరికృష్ణ తరఫున ప్రచారం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ తరఫున అశోకా అకాడమీ చైర్మన్ అశోక్ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి హరికృష్ణను గెలిపించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం

మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: స్కౌట్స్ అండ్ గైడ్స్ పితామహుడు బెడెన్‌పావెల్ జయంతిని పురస్కరించుకొని వరల్డ్ థింకింగ్ డే ఘనంగా నిర్వహించారు. శనివారం సీసీసీలోని సింగరేణి పాఠశాలలో, మందమర్రి సింగరేణి హైస్కూల్‌లో బెడెన్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

జన్నారం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్లు తమఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిబ్బందికి ఓటర్ స్లిప్‌లు అందజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

దండేపల్లి: క్విజ్ పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చని, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి చౌదరి అన్నారు. మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

నెన్నెల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను శనివారం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.